www.vaarthavedhikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



ఢిల్లీ: బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 110 | ఆదివారం | 16, ఫిబ్రవరి 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥

## ఎలాంటి విమర్శలను నేను పట్టించుకోను

- నన్ను కొందరు అంగీకరించకపోవచ్చు.
- కానీ నా పని నేను చేస్తున్నాను
- ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలను నేను పట్టించుకోను
- తెలంగాణ రాష్ట్ర కులగణన దేశానికి రోడ్ మ్యాప్
- సబిత, తలసాని ఏ పార్టీలో గెలిచి, ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారు?
- కాంగ్రెస్ తరఫున ప్రజలకు హామీ ఇచ్చింది నేను. అమలు చేయక పోతే అడిగేది నన్నే
- కేబినెట్ విస్తరణ నా ఒక్కడి నిర్ణయం కాదు
- మీడియాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్
- అంతకుముందు రాహుల్‌తో రేవంత్ భేటీ
- క్యాబినెట్, పీసీసీ కూర్పుపై చర్చ?
- కులగణనపై రేవంత్‌కు రాహుల్ అభినందన



**ఢిల్లీ:** "నేను కొందరికి నచ్చకపోవచ్చు. నన్ను అందరూ ఆమోదించకపోవచ్చు. మరికొందరు నన్ను అంగీకరించకపోవచ్చు. ఎవరేమనున్నా, ఎవరెన్ని విమ ర్శలు చేసినా పట్టించుకోను కానీ నా పని నేను చేసుకుపోతా. ప్రజలకు కాంగ్రెస్ తరఫున ఎన్నికల హామీలిచ్చింది నేను. వాటిని అమలు చేయకపోతే ప్రజలు అడిగేది నన్ను మాత్రమే. బీసీ కులగణన చరిత్రాత్మకం. మంత్రివర్గ విస్తరణ నా ఒక్కడి చేతిలో లేదు. ప్రధాని మోదీని నేనేమీ విమర్శించలేదు. ఉన్నదే చెప్పా. బీజేపీ వాళ్లు కూడా అదే చెప్పారు. ఫిరా యింపుల గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ ఏ పార్టీలో గెలిచి ఏపార్టీలో మంత్రులయ్యారన్న విషయాన్ని ఎందుకు చెప్పడం లేద"ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే.. తెలం గాణ కులగణనపై పూర్తిగా రాహుల్ గాంధీకి వివరిం చాను. పూర్తి శాస్త్రీయంగా కులగణన చేశాం. తెలం గాణలో బహిరంగ సభ ఉంటుంది. దానికి రావాలని రాహుల్ గాంధీని కోరాను. రాహుల్ గాంధీ చెప్పిన ఆదేశాలను ఫాలో అయ్యాను. తెలంగాణ రాష్ట్ర కులగణన దేశానికి రోడ్ మ్యాప్.

ప్రతిపక్షాలు కావాలనే కులగణనపై రాద్ధాంతం చేస్తున్నాయి. రాజకీయ కోణంలో కాదు ప్రజా సంక్షేమ కోణంలోనే కులగణన జరిగింది. ప్రజలను ఉద్రేకపరిచే ప్రయత్నం చేస్తున్నాయి. ఎక్కడ లెక్క తప్పలేదు. అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు బిల్లు తీసు కొస్తాం. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు ఎలా ఉంటుందో చూడాలి. సుప్రీంకోర్టు తీర్పు కంటే ముందే, కేటీఆర్ ఏదేదో చెప్తున్నాడు. సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు

మిగతా 2లో..





## బిల్డర్స్‌కు స్వర్గధామం హైదరాబాద్

- హైదరాబాదును గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకున్నాం
- ఆదాయం కంటే హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానం
- హైదరాబాదులో డీజిల్ వాహనాలను దశలవారీగా ఎలక్ట్రికల్ వాహనాలుగా మారుస్తాం
- ప్రపంచ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ.. ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణయాలు
- మూసి పునర్జీవనానికి ముందుకు పోతాం.. ఆధునిక దేశాల బాటలో తెలంగాణను నడిపిస్తాం
- రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం హైదరాబాద్ అభివృద్ధికి పదివేల కోట్లు
- రాష్ట్రంలో బిల్డర్స్‌కు సంపూర్ణ సహకారం
- హైదరాబాద్ నోవాటెల్ లో జరిగిన బిల్డర్స్ గ్రీన్ తెలంగాణ సమ్మిట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి15(వార్త వేదిక సూర్య):** బిల్డర్స్, డెవలపర్స్ ను రాష్ట్ర ప్రభుత్వం గౌరవప్రదమైన పౌరులుగా చూస్తుంది, వారు సంపద సృష్టికర్తలు, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు వారికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం నోవాటేల్‌లో జరిగిన తెలంగాణ బిల్డర్స్ గ్రీన్ సమ్మిట్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

బిల్డర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేని కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది, ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేసి బిల్డర్స్, డెవలపర్స్ ను ఇబ్బంది పెట్టే పని చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే వ్యక్తులుగా బిల్డర్ కు సంపూర్ణ సహకారం అందిస్తాం, బిల్డర్స్కు హైదరాబాద్ స్వర్గధామం లాంటిదని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఒక యువ రాష్ట్రం, ప్రపంచ పటంలో రైజింగ్ గా కనిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు.

నెట్ జీరో సిటీ ఒప్పందం చేసుకొని హైదరాబాద్ ప్రపంచానికి ఒక సందేశం ఇస్తుంది అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని ప్రపంచమంతా

మిగతా 2లో..

## మోదీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధమా?

- రాహుల్ కు ఒక కులం లేదు.. మతం లేదు.. జాతి లేదు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ అంశమే రెఫరెండమా?
- బీసీల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు
- మతపరమైన రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం
- బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి పంపితే కేంద్రాన్ని ఒప్పిస్తా
- రాజాసింగ్ హిందూ ధర్మం కోసం పోరాడే నాయకుడు
- ధర్మ పోరాటంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు
- రాజాసింగ్‌కు అభ్యంతరాలుంటే అంతర్గతంగా మాట్లాడాలి
- మీడియాకు ఎక్కడం సరికాదు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- రూ.12.75 లక్షల వరకు ఐటీ మినహాయింపుపట్ల టీఎన్జీవో నాయకుల హర్షం
- బండి సంజయ్‌ను సన్మానించిన టీఎన్జీవో నేతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి15(వార్త వేదిక సూర్య):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి మోదీది ఏ కులం? రాహుల్ గాంధీది ఏ మతం అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి వెళదామా? అంటూ కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బీసీ జాబితాలో ముస్లింలను కలపడంపట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవాకులు పేలుతున్నారని మండి పడ్డారు. ముస్లింలను బీసీ జాబితాలో కలిపి రిజ ర్వేషన్ల జాబితాను కేంద్రానికి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

"మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదు. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలాడుతోంది. ప్రజలకు, బీసీ సంఘాలకు ఈ విషయం తెలుసు"అని వ్యాఖ్యానించారు. ఈరోజు హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో ఎనిమీ ప్రాపర్టీస్ (శత్రు ఆస్తులు)పై కేంద్ర, రాష్ట్రఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వివరాలు

మిగతా 2లో..





## మోడీ పుట్టుకతో బీసీ కాదు

- బండి సంజయ్ కష్టపడి పని చేసినా ఎన్నికల నాటికి తీసి పడేసింది
- సోనియా గాంధీ ఇటలీలో పుట్టినా భారతీయత పుణికి పుచ్చుకుంది
- పింక్ బుక్ ఓపెన్ చేయవద్దు అని కవితకు సూచనలు చేస్తున్నా : టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్,ఫిబ్రవరి15(వార్త వేదిక సూర్య):** 1994లో మోడీ గాన్సి అనే కులాన్ని బీసీలలో చేర్చారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా మోడీ లీగల్లి కన్వర్టే బీసీ అని అన్నారు. పదేళ్లలో ఓబీసీ ప్రధాని మోదీ బీసీలకు చేసింది ఏమి లేదు. కుల గణన దేశ చరిత్రలో నిలిచిపోయే అంశం.

మిగతా 2లో..



## గిరిజనులకు ఎమ్మెల్సీ ఇచ్చే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా?

- కేసీఆర్ అంటే మరో సేవాలాల్
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

**హైదరాబాద్,ఫిబ్రవరి15(వార్త వేదిక సూర్య):** పోడు భూములకు రైతుబంధు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్ దే. గిరిజనులకు రిజర్వేషన్ పెంచిన గొప్ప నాయకుడు కేసీఆర్. గవర్నర్ కోటాలో గిరిజనులకు ఎమ్మెల్సీ ఇచ్చే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా? 95 గిరిజన గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించాం. రేవంత్ పాలనలో గిరిజన జాతి అనాథలుగా మారారు. బడ్జెట్ లో గిరిజన సంక్షేమానికి కేటాయింపులు లేవు. మిషన్ భగీరథతో గిరిజన తండాల్లో నీటి కష్టాలు లేకుండా చేశాం.

### పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్ దే: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

పోడు భూములకు పట్టాలిచ్చి రైతు బంధు ఇచ్చాం. గిరిజనులకు రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డిది.

మిగతా 2లో..

## రేవంత్ వ్యాఖ్యలు దేశంలోని బీసీలను అవమానించడమే

- ఇందుకు ఆయన క్షమాపణలు చెప్పాలి
- ప్రధాన మంత్రి పదవిని బీసీ చేపడితే ఓర్వలేకపోతున్నారు
- 3 ప్రశ్నలతో ఇంటింటికి సర్వే చేయాలి
- బీసీ సంఘాల ప్రతినిధులతో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య




**హైదరాబాద్,ఫిబ్రవరి15(వార్త వేదిక సూర్య):** ఒక బీసీ ప్రధానమంత్రి రాణిస్తుంటే అగ్రవర్ణాల్లోని కొంతమంది జీర్ణించు కోలేకపోతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యున్నత ప్రధాన మంత్రి పదవిని బీసీ చేపడితే ఓర్వలేకపోతున్నారన్నారు. నరేంద్ర మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రిపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ సమస్యలను పక్కదారి పట్టించేందుకు రేవంత్ రెడ్డి కొత్త ఎత్తుగడ వేశారని బీసీ కుల గణన తప్పులతడకగా సాగిందని, ఈ అంశాన్ని పక్కదారి

మిగతా 2లో..

## ఎన్టీఆర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం

- సేవా కార్యక్రమాల్లో ముందుండే ఎన్టీఆర్ ట్రస్ట్‌ను అభినందిస్తున్నాను
- తలసేమియా బాధితులకు అండగా మ్యూజికల్ నిర్వహణ మంచి నిర్ణయం
- మంచి కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది
- ఎన్టీఆర్ లాగే నారా భువనేశ్వరి కూడా మొండిఘటం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన యుఫోరియా మ్యూజికల్ నైట్ కు హాజరైన సీఎం చంద్రబాబు





**విజయవాడ, (వార్త వేదిక సూర్య)** ఈ సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ తరఫున ధన్యవాదాలు. హెరిటేజ్ నే కాదు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ను కూడా అంతే సమర్థవతంగా నడిపించే శక్తి నారా భువనేశ్వరికి ఆయన తండ్రి ఎన్టీఆర్ నుంచి వచ్చింది. ఎన్టీఆర్ లాగానే భువనేశ్వరి కూడా మొండిఘటం. మంచి కార్యక్రమం జరగాలంటే సమర్థవంత మైన టీం ఉండాలి. ఆ టీమ్ లో భాగంగానే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో రాజేంద్ర కుమార్, గోపీ, ఇతర సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నా మిత్రుడు, రాష్ట్రానికి ఏదో చేయాలని తపించే వ్యక్తి పవన్ కల్యాణ్ , గౌరవనీయులు, నటలోనే కాదు సేవా కార్యక్రమాల్లోనూ తండ్రిని మించిన బిడ్డ, పద్మవిభూషణ్ నందమూరి బాలకృష్ణ,

ఎన్టీఆర్ ట్రస్ట్‌కు మొన్నటి వరకూ సేవలు అందించిన నారా లోకేష్ గారికి, ట్రస్ట్ సభ్యురాలు నారా బ్రాహ్మణి, నందమూరి తమన్, ఈ కార్యక్రమానికి వచ్చిన కుటుంబసభ్యులు, ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది, విద్యార్థులు, దాతలందరికీ అభినందనలు. మంచి కార్యక్రమానికి ప్రజలు ఇచ్చిన ఆదరణ మరువలేం. మీరు చూపించే సేవాభావానికి శిరసు వంచి సెల్యూట్ చేస్తున్నాను.

మిగతా 2లో..



## 100% సర్వే జరిగింది అని చెప్పలేదు

- ప్రధానమంత్రి పుట్టుకతో బీసీ కాదు.. కన్వర్టెడ్ బీసీ
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్,(వార్తవేదిక సూర్య)** తెలంగాణ ప్రభుత్వం దేశంలో మొట్టమొదటిసారిగా మా నాయకుడు రాహుల్ ఎన్నికల హామీ మేరకు భారత్ జూడో పాదయాత్ర సందర్భంగా దేశ వ్యాప్తంగా తిరిగే సందర్భంలో ప్రజల ఆకాంక్షల కను గుణంగా

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



## స్నేహితుల సహాయంతో చనిపోయిన కుటుంబానికి ఆర్థిక సహాయం

**తొర్రూర్, ఫిబ్రవరి 15(వార్తా వేదిక సూర్య):**
తొర్రూరు(మ).చర్లపల్లెం గ్రామానికి చెందిన ధర్మారపు అల్లవ్( నరేష్) వలస కూలీ పని చేస్తు ఇటీవల అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. వీరి కుటుంబం రెక్కాడితే కానీ డొక్కా అడని కటిక పేద కుటుంబం వారిది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు .ఈ విషయం తెలుసుకున్న గుండేటి మహేందర్ వాట్సాప్ ద్వారా తన స్నేహితులకి తెలియచేసి. స్నేహితులు సహాయం చేసిన ఇరవై ఎనిమిది వేయిలు రూపాయలు అమౌంట్ చనిపోయిన వారి ఇద్దరి కూతుర్లు పేరు మీద పోస్ట్ ఆఫీసు లో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఆర్థిక సహాయం చేయడం జరిగింది. గుండేటి మహేందర్,చంటి, విష్ణు ,తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ ధర్మబిక్షం బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివి : లింగంగౌడ్

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 15(వార్త వేదిక సూర్య):**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పూలమాలలతో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా, ఆయన సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని విద్యార్థి దశ నుంచే



రాజకీయాలలో పాల్గొని విద్యార్థులందరిని ఏకం చేసి నిజాం నవాబు జన్మదిన వేడుకలు బహిష్కరించి అందరి దృష్టిని ఆకర్షించారని అన్నారు.కమ్యూనిస్టు నాయకునిగా సబ్బండ వర్గాలు, పీడిత ప్రజల హక్కుల కోసం ఆయన ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేశారని అన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాల కోసం నిలిచి విలువలు కలిగిన నాయకుడుగా ధర్మభిక్షం అందించిన స్ఫూర్తి నేటి తరాలకూ అనుసరణీయమని జాజుల అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో కల్లుగీత వృత్తిదారుల కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్,బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్, రావులకొలు నరేష్, పానుగంటి విజయ్, బొంగు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

**పెద్ద శంకరంపేట్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):**
మెదక్ జిల్లా పెద్ద శంజరంపేట మండల కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవలల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల ఎస్.టి.సెల్ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ మండలంలో



13 తాండాలు ఉన్న మండలంలో మా లంబాడీలకు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడానికి సరైన స్థలం లేదు మరియు కమిటీ హాల్ లేదని గతంలో ఉన్న ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి మండలంలో స్థలం కేటాయించమని చెప్పిన పట్టించుకోలేదు. దయచేసి ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాపై దయ తలచి మండలంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రామావత్ గోపాల్ నాయక్, మాజీ ఎంపిటిసి రాజు, విట్టల్, పులియ నాయక్, దేనియ నాయక్,.చిన్న, ఈశ్వర్ నాయక్, తదితర తాండల నాయకులు పాల్గొన్నారు.

## ఎలాంటి విమర్శలను నేను పట్టించుకోను

(మొదటి పేజీ తరువాయి)

ఏ పార్టీలో గెలిచి, ఏ పార్టీలో మంత్రులుగా పనిచేశారు?

ప్రధానిని కించపరిచేలా నేను మాట్లాడలేదు. ఉన్నది ఉన్నట్లుగానే చెప్పాను. బిజెపి నేతలు సైతం అదే విషయాన్ని ధృవీకరించారు, ఒప్పుకుంటున్నారు. నేను కొందరికి నచ్చకపోవచ్చు. నన్ను కొందరు అంగీకరిం చక పోవచ్చు. కానీ నా పని నేను చేస్తున్నాను. నన్ను ప్రశ్నించే పరిస్థితి తెచ్చుకోను.కాంగ్రెస్ తరపున ప్రజలకు హామీ ఇచ్చింది నేను. అమలు చేయక పోతే అడిగేది నన్నే. కొంతమంది నాపై అబద్ధపు ప్రచారాలు చేసి, పైశాచిక ఆనందం పొందుతున్నారు. కేబినెట్ విస్తరణ నా ఒక్కడి నిర్ణయం కాదు. ఎవరు ఏమనుకున్నా, ఎలాంటి విమర్శలను నేను పట్టించుకోను. పీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలపై కొందరు పైశాచిక ఆనందం కోసం ఊహాగానాలు వ్యాప్తి చేస్తున్నారు.



### రాహుల్‌తో రేవంత్ భేటీ

కాగా అంతకుముందు రేవంత్ కాంగ్రెస్ కీలకనేత రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీ కులగణనపై వారిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. దేశంలోనే తొలిసారిగా కులగణనను శాస్త్రీయంగా నిర్వహించి, తన మాట నిలబెట్టినందుకు రేవంత్‌ను రాహుల్ అభినందించినట్లు సమాచారం. వర్గీకరణ, కులగణనతో తీసుకున్న అనుకూల నిర్ణయాల వల్ల బీసీ, మాదిగ వర్గాలు సంతోషంగా ఉన్నట్లు రేవంత్ వివరించినట్లు తెలిసింది. ఇక మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపైనా వారిద్దరి మధ్య చర్చ జరిగినట్లు చెబుతున్నారు. ఇదిలాఉండగా సూర్యాపేట, గద్వాలలో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభలకు రావాలని రాహుల్‌గాంధీని ఆహ్వానించారు.

# బిల్డర్స్‌కు స్వర్గధామం హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ఆసక్తిగా ఎదురుచూస్తుం దని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

హైదరాబాదును గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఢిల్లీ ప్రజలు స్థానికంగా ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు ఒక సీజన్లో అక్కడి నుంచి పౌరులు వలస వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.. ఆ దుస్థితి హైదరాబాద్‌కు రాకుండా ఉండేందుకు పలు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. హైదరాబాద్ నగరంలోని డీజిల్ వాహనాలను దశలవారీ ఎలక్ట్రికల్ వాహనాలుగా మారుస్తున్నట్టు తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయాన్ని కోల్పోయి రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించేందుకు కూడా వెనుకాడ లేదని తెలిపారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాదును తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

ఆదాయం కంటే హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానం అన్నారు. ఫోర్త్ సిటీ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ. ప్రపంచ కేంద్రంగా ఫోర్త్ సిటీని తీర్చి దిద్దుతాం అన్నారు. నెట్ జీరో సిటీ నిర్మాణంలో భాగంగా ఈ ప్రాంతంలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకుందని వివరించారు.

మూసి పునర్జీవనం రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయి, దశాబ్ద కాలంగా కాలుష్య కాసారంతో ప్రజలు జీవించడానికి ఇబ్బంది పడుతున్నారు.. ఈ నదిలో పరిశుభ్రమైన నీరు పారించి.. మూసి హైదరాబాద్కు ఒక వరంలా మారుస్తాము, హైదరాబాదును అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం అన్నారు. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎంత ఖర్చు అయినా ముందుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

హైదరాబాద్ చుట్టుపక్కల పెట్టుబడులకు సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబులు దావోస్లో పర్యటించి 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించారని వివరించారు. 2029–30




కి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా కొత్త విద్యుత్ పాలసీలో స్పష్టం చేశామని, 35 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు పోతున్నట్టు తెలిపారు.

ఆధునిక దేశాల బాటలో తెలంగాణను నడిపించేందుకు కేవలం అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాదు నగరానికి ఒక ఏడాదిలో పదివేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం హైదరాబాదును ఉన్నత స్థానానికి తీసుకువెళ్లిందని తెలిపారు.

# మోదీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పై విధంగా స్పందించారు. ఏమన్నారంటే....

తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ పై సమీక్ష నిర్వహించాం. రంగారెడ్డి, హైదరాబాద్, కొత్త గూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్(శత్రు ఆస్తులు) ఉన్నాయి. చాలా ఆస్తులు ఆక్రమణలు జరిగాయి. వాటిని ఏ విధంగా స్వాధీనం చేసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా పొజిషన్ లో ఉన్న సామాన్య ప్రజలు, రైతులకు ఇచ్చేందుకు ఉన్న అవకాశాలేమిటి? అనే అంశాలపై పూర్తిస్థాయిలో సర్వే, రికార్డ్స్ పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను కోరాము.

గతంలో పాకిస్తాన్ తో యుద్ధం సందర్భంగా ఇండియా నుండి పాకిస్తాన్ వెళ్లిన ప్రజలు, ఇక్కడ తమ ఆస్తులను వదిలేసి వెళ్లారు. అట్లాగే పాకిస్తాన్ నుండి ఇండియాకు వచ్చిన వాళ్లు అక్కడ తమ ఆస్తులను వదిలేశారు. అయితే ఆ ఆస్తులు పాకిస్తాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించి అమ్మేసుకుంది. ఈ నేపథ్యంలో దేశంలోని ఎనిమీ ప్రాపర్టీస్ ను కూడా అమ్మేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని నిర్ణయించాం. తెలంగాణలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని అంచనా వేస్తున్నాం. మార్చి నెలాఖరులోపు ఆయా ఆస్తులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం.

మనిషి పుట్టిన వెంటనే కులం పేరు పెడతామా? రేవంత్ రెడ్డికి అట్లనే చేశారా? ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రధానిపై మాట్లాడేటప్పుడు అవాకులు, చవాకులు మాట్లాడతారా? రేవంత్ విజతకే వదిలేస్తున్నా. మోదీ ముమ్మాటికీ బీసీనే. 1994లోనే గుజరాత్ లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే మోదీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చింది. ఈ దేశంలోని వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలు, దళిత జాతి మొత్తం మోదీ తొలిసారి ప్రధానమంత్రి కాగానే సంబురాలు చేసుకున్నారు.

మోదీ సైతం తన తొలి కేబినెట్ లో 27 మంది బీసీలను మంత్రులుగా చేశారు. అట్లాగే 12 మంది దళితులను, 8 మంది ఎస్టీలను మంత్రులుగా చేశారు. మరి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఎంత మంది బీసీలున్నారు? ఇద్దరు మాత్రమే. మరి కుల గుణన సర్వేలో 46 శాతం మంది బీసీలున్నట్లు మీ ప్రభుత్వం లెక్క తేల్చింది. అంతకుముందు కేసీఆర్ హయాంలో సర్వే చేస్తే 51 శాతం బీసీలున్నట్లు తేల్చారు. ఈ లెక్కన మీ ప్రభుత్వంలో ఎంత మంది మంత్రులుండాలి? మరి మీరు ఎంత మందికి అవకాశం కల్పించారు?

### అసలు మోదీ కులం గురించి చర్చించాల్సిన అవసరం ఏముంది?

ఆ విషయానికొస్తే... రాహుల్ గాంధీ కులం, మతం, జాతి గురించి చర్చ చేయాలి. ఎందుకంటే రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్. ఆయన తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్. ఇటలీ దేశస్తురాలు. మరి రాహుల్ ఏ కులమని ప్రోత్సహిస్తున్నారు. రాహుల్ కు ఒక కులం లేదు, మతం లేదు, జాతి లేదు. మరి అట్లా చర్చ చేయాలంటే టెన్ జన్ ఫథ్ నుండే రాహుల్ కులం, మతం గురించి చర్చ చేద్దామా? దీనికి రేవంత్ ఏం సమాధానం చెబుతారు.

రేవంత్ తీరు కొరివితో తలగోక్కోవడమంటే ఇదే. రేవంత్ కు దమ్ముంటే... మోదీ బీసీయా కాదా? రాహుల్ గాంధీ కులం, మతంపై ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెఫరెండంగా భావిద్దామా?

నేనడుగుతున్నా 6 గ్యారంటీలపై ప్రజలు నిలదీస్తుంటే వాటిపై చర్చ చేయకుండా, సమా ధానం చెప్పకుండా రేవంత్ రెడ్డి డైవర్షన్ పొలిటిక్స్ చేస్తున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్నరు. తొలి ఏడాదే 2 లక్షల ఉద్యో గాలను భర్తీ చేస్తామన్నరు. ఉద్యోగులను పీఆర్సీని అమలు చేస్తామన్నారు. కానీ ఏమీ చేయలేదు.

నిరుద్యోగుల పక్షాన కొట్లాడి జైలుకు పోయింది బీజేపీ. వాళ్లకు అండగా ఉన్నది బీజేపీ. ఇచ్చిన మాట ప్రకారం రోజ్ గార్ మేళా కింద 9.25 లక్షల ఉదయోగాలను భర్తీ చేసింది బీజేపీ ఆధ్వర్వలోని కేంద్ర ప్రభుత్వం. మరి మీరు చేసిందేమిటి? 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 50 వేల మందికి ఉద్యోగాలిచ్చినట్లు చెప్పుకుంటున్నారు. సిగ్గుండాలే.

బీసీ జాబితాలో ముస్లింలను కలిపితే కేంద్రం ఒప్పుకునే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లుకు మేం వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టి రాజకీయం చేయడానికి రేవంత్ రెడ్డి డ్రామాలాడుతున్నారు. కాంగ్రెస్ కు దమ్ముంటే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించాలి. అట్లాగే పూర్తిస్థాయిలో కులగణన చేసి బీసీ జనాభా లెక్క తేల్చాలి. ఆ తరువాత కేంద్రానికి పంపితే ఒప్పించి ఆమోదింపజేసే బాధ్యత మేం తీసుకుంటాం. అంతే తప్ప బీసీ జాబితాలో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రానికి పంపితే ఒప్పుకునే ప్రసక్తే లేదు. మత రిజర్వేషన్లను వ్యతిరేకించి తీరుతాం. అది తెలిసి కూడా కేంద్రానికి పంపిస్తాం... ఆమోదించాలని మాట్లాడటం విడ్డూరం.

అసలు బీసీ జాబితాలో ముస్లింలను కలపడంవల్ల బీసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో, నిధులు కేటాయింపులతో తీవ్రమైన అన్యాయం జరిగే ప్రమాదముంది. ఇప్పటికే ముస్లింలకు మైనారిటీ కోటాలో లాభం చేకూరుస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ కొటాలోనూ లబ్ది పొందుతున్నారు. మళ్లీ బీసీ జాబితాలో కలపడం ఏందీ? అట్లా చేస్తే బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి గెలుస్తారు. అప్పుడు బీసీలకు పూర్తిగా అన్యాయం జరుగుతుంది. ఇగ బీసీలకు చేసిన లాభమేంది? కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. ఒకవర్గానికి మేలు చేసేందుకు బీసీలను రాచిరంపాను పెడుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటును ఆయుధంగా మార్చుకుని కాంగ్రెస్ కు బుద్ది చెప్పాలని కోరుతున్నా.

కాంగ్రెస్ కులగణన సక్రమమైతే రీ సర్వే ఎందుకు చేస్తున్నారు? తెలంగాణలో 3 కోట్ల 95 లక్షల ఆధార్ కార్డులున్నట్లు నివేదికలున్నయ్. ఆధార్ తీసుకోని వారి శాతం మరో 10 శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుల గణన సర్వే చేసి 3 కోట్ల 70 లక్షల జనాభా ఉన్నట్లు తేల్చడమేంది? మిగిలిన 60 లక్షల మంది ప్రజలేమైపోయారు? కాంగ్రెస్ చంపేసిందా? మీకు దమ్ముంటే ఇంటింటికీ వెళ్లి కుల గణన చేయాలి. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి కేంద్రానికి పంపాలి. అంతే తప్ప హిందూ జనాభా తగ్గించి ముస్లిం జనాభా పెంచి నివేదిక పంపుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదు...

రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.... ఒక కులానికే బీజేపీలో పదవులిచ్చారని అనడం కరెక్ట్ కాదు. గత ఎన్నికల్లో బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించింది. అట్లాగే అంతకుముందు బీసీనైన నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారు. బీసీ అయిన లక్ష్మణ్ కు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం తోపాటు పార్లమెంటరీ బోర్డు పదవి ఇచ్చింది. బీసీని సీఎం చేస్తానని ప్రకటించింది కాబట్టి ఓసీ అయిన కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చింది. అయినా పార్టీ నియమనిబంధనల ప్రకారం పదవులిస్తారు. ఏదైనా అభ్యంతరాలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించాలి. అంతే రోడ్డుకు ఎక్కడం సరికాదు. రాజాసింగ్ కు ఇబ్బందులుండొచ్చు. బాధ ఉండొచ్చు. ఆయన కమిట్ మెంట్ ఉన్న నాయకుడు. హిందుత్వవాది. చాలా మంచి వ్యక్తి. అనేక రకాలుగా ధర్మం కోసం పోరాడుతూ ఇబ్బంది పడ్డారు. ఆయన మావాడు. ఆయనతో నిన్న మాట్లాడిన. ఇకపైనా మాట్లాడతా. ఎందుకంటే మా పార్టీ నాయకుడు.

## ఎన్టీఆర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

తలసేమియా వ్యాధితో చిన్నారులు బాధ పడుతున్నారు. తలసే మియా బాధితులను ఆదుకునేందుకు ముందు కొచ్చిన ఎన్టీఆర్ ట్రస్ట్‌ను, నారా భువనేశ్వరి గారిని అభినందిస్తున్నాను. మ్యూజికల్ నైట్ నిర్వహణలో నా ప్రమేయం లేదు. నేను ఎవరికీ చెప్పలేదు. కానీ కార్యక్రమాన్ని బ్రహ్మాండంగా చేశారు.

### సమాజం కోసం ఎన్టీఆర్ తపించేవారు

ఎన్టీఆర్ అంటే తెలుగు జాతి పౌరుషం. మంచి పాలన మాత్రమే కాదు సమాజం కోసం ఎన్టీఆర్ నిరంతరం తపించారు. మా అత్తగారు బసవతారకం క్యాన్సర్ తో చనిపోయారు. ఆనాడు ఆవిడకు చికిత్స అందించేందుకు సరైన ఆస్పత్రులు లేవు. ఇంకెవరూ క్యాన్సర్ తో చనిపోకూడదని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభించారు.

నేను ముఖ్యమంత్రి అయ్యాక ఆస్పత్రిని అభివృద్ధి చేసి నిధులు వచ్చేలా చేశారు. బాలకృష్ణ ఆస్పత్రిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నారు. మా కార్యకర్తలను పొట్టన పెట్టుకున్నారు. ఫ్యాక్షన్ పాలిటిక్స్‌లో చాలామందిని చంపేశారు. నక్సల్స్ ఉద్యమంలో, యాక్సిడెంట్లలో ఎందరినో కోల్పోయాం. టీడీపీ కుటుంబసభ్యులు అనాథలు కాకూడదని ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ స్థాపించాం.

ఆరోగ్యం, విద్య, విపత్తు సాయం, స్కిల్ డెవలప్ మెంట్, మహిళా సాధికారతలో ఎన్టీఆర్ ట్రస్ట్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ డాక్టర్ రెడ్డి చైర్మన్‌గా నాంది ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. ఆయన ఆ ఫౌండేషన్ ను ఆనంద్ మహేంద్రాకు అప్పగించారు. బసవ తారకం ఆస్పత్రి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మంచి పేరు సంపా దించాయి. నందమూరి బాలకృష్ణ తల్లిపేరుతో వైద్య సేవలు అందిస్తున్నారు. నారా భువనేశ్వరి తండ్రి పేరుతో ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నారు. ఆ పుణ్య దంపతులకు దక్కిన గౌరవమిది. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, ఎన్టీఆర్ ట్రస్ట్ శాశ్వతంగా ఉంటాయి. 11.11.11లో స్వర వేద కార్యక్రమం గచ్చిబౌలిలో పెట్టాం. అప్పుడు శివమణి వచ్చాడు. ఇప్పుడు తమన్ యుఫోరియా మ్యూజికల్ నైట్ కు ముందుకొచ్చారు.

ఒక్కరూపాయి కూడా తీసుకోకుండా తలసేమియా బాధితులకు అండగా నిలిచిన తమన్ ను అభినందిస్తున్నాను. నా మిత్రుడు పవన్ కల్యాణ్ టికెట్ తీసుకోకుండా రూ. 50 లక్షలు విరాళం ఇచ్చారు. మంచి కార్యక్రమానికి ముందుకొచ్చిన ఆయన్ను అభినందిస్తున్నాను. 28 ఏళ్లుగా ఎన్టీఆర్ ట్రస్ట్, 33 ఏళ్లుగా హెరిటేజ్ ను నా కుటుంబసభ్యులు సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

### సేవా భావం ప్రతి ఒక్కరిలో రావాలి

సమాజం వల్లే మనం పైకి వచ్చాం. ఆ సమాజానికి సేవ చేయడం మనందరి బాధ్యత. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చించాలి. అవనిగడ్డలో తుపాను వచ్చినా ,రాయల సీమలో కష్టమొచ్చినా జోలి పట్టి ఆదుకున్న మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ .

ఈ కార్యక్రమానికి రావడం కోసం నేను కూడా టికెట్ తీసుకున్నాను. రూ. లక్ష ఇచ్చాకే నాకు టికెట్ ఇచ్చారు. ప్రజల మద్దతుతో ఎన్టీఆర్ ట్రస్ట్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు అన్నారు.

## 100% సర్వే జరిగింది అని చెప్పలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరికిఎంతో వారికంతా రావాలని దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా రాష్ట్రంలో అధికారంలోకి వస్తె రాష్ట్రంలో కుల సర్వే చేస్తామని హామీ ఇచ్చారు.

దానిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పక్షాన లక్ష మంది ఉద్యోగులతో 150 ఇళ్లకు ఒకరు చొప్పున కుల సర్వే జరిగింది. మేము 100% సర్వే జరిగింది అని చెప్పలేదు. 3.1 % అందులో హైదరాబాద్ నగరంలో రెండున్నర లక్షల ఇళ్లు మొత్తం, మూడు లక్షల 54 వేల ఇల్లు మిగిలిపోయాయని చెప్పడం జరిగింది. ఒక కోటి 15 లక్షల ఇళ్లకు గాను ఒక కోటి 12 లక్షల ఇళ్లలో సర్వే జరిగింది. ఈ సర్వే జరిగిన సందర్భంలో అన్ని రాజకీయ పార్టీలు సర్వే జరగాలని తీర్మానానికి అరకొరా మద్దతు ఇచ్చి. సర్వే జరిగిన తర్వాత కూడా శాసనసభలో చర్చకు పెడితే అరకోరా మద్దతు ఇచ్చి వాళ్ల యొక్క బుద్ధిని చాటుకున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ కోసం జరుగుతున్న ఈ కులాల సర్వేలో అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారు. ముఖ్యమంత్రి నిన్న కాంగ్రెస్ శ్రేణుల సమావేశంలో మాట్లాడింది భారత ప్రధానమంత్రి పుట్టు బీసీ కాదు. 1994లో చరణ్ దాసు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మారిందా? ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్చుకున్నారా? అనే అంశాన్ని పక్కన పెడితే.. ఒకప్పుడు ఆయన బీసీ కన్వర్ట్ గా మారారు.కిషన్ రెడ్డి మిగతా కులాల గురించి మాట్లాడుతున్నారు. దేశంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ మిగతా బిజెపి నాయకులను అడుగుతున్నా.. ప్రధానమంత్రి కులానికి సంబంధించిన ప్రస్తావన తెచ్చి. తెలంగాణ బలహీన వర్గాలకు అన్యాయం చేసే ప్రయత్నం మానుకోండి. 1994 లో అయ్యాడా? 2004 లో ముఖ్యమంత్రి అయిన తరువాత అయ్యాడా అనేది ఐదారు సంవత్సరాల తేడా కావచ్చు.

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం జరుగుతున్న సర్వేకు మిగిలిన వారికి 16 వ తేది నుండి 28 తేదీ వరకు అవకాశం ఇచ్చాం. మీకు వీలైతే హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి, ఎక్కడైనా మిస్ అయిన వారిని చైతన్యపరిచి తెలంగాణ జనాభా లెక్కల్లో ఉండాలని చెప్పండి. కుల సర్వే జనాభా లెక్కల్లో పేర్లు ఇయ్యక సమాచారం ఇవ్వక స్పందించక ఏది పడితే అది మాట్లాడితే మంచిది కాదు. తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వే ను చట్టబద్ధం చేయడానికి క్యాబినెట్ లో పెట్టి తెలంగాణ జనాభా లెక్కల్లో 56% బీసీలు వచ్చారు. వాళ్ళకి 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన దానికనుగుణంగా క్యాబినెట్ తీర్మానం చేయబోతున్నాం. క్యాబినెట్ తీర్మానం తో పాటు శాసనసభలో చట్టం తీసుకొస్తాం రాజకీయ విద్య ఉపాధి అవకాశాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని శాసనసభ వేదికగా చట్టం చేయబోతున్నాం. ఈ అంశానికి మీరు మద్దతు ఇస్తున్నారా వ్యతిరేకమా చెప్పాలి. ఈ ప్రతిపాదనను తీసుకుపోయి ఢిల్లీలో ప్రధానమంత్రిని ఒప్పిస్తారా లేదా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను వక్రీకరించి మాట్లాడుతున్నారు. ప్రధానమంత్రి పుట్టుకతో బీసీ కాదు కన్వర్టెడ్ బీసీ అని మీరే ఒప్పుకుంటున్నారు. 2001 లో ముఖ్యమంత్రి అయిన తర్వాత కన్వర్టెడ్ బీసీ అని మేము అంటున్నాం. కానీ అంతకుముందే మీ ముఖ్యమంత్రి చేశారని మీరు అంటున్నారు.

## మోడీ పుట్టుకతో బీసీ కాదు

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి అన్న మాటలకు బీజేపీ నేతలు హైరానా పడుతున్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారు. బండి సంజయ్ పుట్టుకతో ఓబీసీ. మోడీ పుట్టుకతో బీసీ కాదు. బండి సంజయ్ కష్టపడి పని చేసిన.. ఎన్నికల నాటికి తీసి పడేసింది. బీసీల మీద బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే జన గణన తో పాటు కుల గణన చేయాలి. కుల గణన రీ సర్వే పూర్తి అయ్యాక చట్టం చేస్తాం. 9వ షెడ్యూల్ చట్ట సవరణ చేసి దేశంలోని బీసీ లకు కేంద్రంలో ఉన్న బీజేపీ మేలు చేయండి. సీఎం రేవంత్ రెడ్డి మోడీ కులం గురించి తప్పు మాట్లాడలేదు. అమిత్ షా కూడా దీనిని అంగీకరించారు. 24-7-1994 లో ఓసీ నుంచి ఓబీసీ లలో చేర్చారు. రాహుల్ గాంధీ తాత గురించి బట్టబాజి మాటలు బీజేపీ మాట్లాడుతుంది. గాంధీ కుటుంబం త్యాగాలు మర్చిపోయి బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. బీజేపీ నేతలు దేశం కోసం ఏం త్యాగం చేశారు?

రాహుల్ గాంధీ కులం దేశ ప్రజలకు తెలుసు. రాహుల్ గాంధీ కులం అడుగుతున్న మీరు దేశంలో కుల గణన చేసి ఆయన ఇంటికి వెళ్లి అడగండి. సోనియా గాంధీ ఇటలీ లో పుట్టి నా భారతీయత ను పుణికి పుచ్చుకుంది. ఇప్పటికే డిల్లీ స్కాం బయటపడింది. పింక్ బుక్ ఓపెన్ చేస్తే ఇంకా ఎన్ని స్కాం లు బయట పడతాయో తెలియదు. అందుకే పింక్ బుక్ ఓపెన్ చేయవద్దు అని కవిత కు సూచనలు చేస్తున్నాను. కేంద్ర మంత్రినని మర్చిపోయి బండి సంజయ్ మాట్లాడుతున్నారు. సెక్యులర్ దేశం అని బండి సంజయ్ గుర్తు పెట్టుకోవాలి.

## గిరిజనులకు ఎమ్మెల్సీ ఇచ్చే దమ్ము రేవంత్ రెడ్డికి ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించాం. గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. కేసీఆర్ కిట్‌ల పంపిణీని బంద్ చేశారు. గిరిజనుల్లో నిర్మాణాత్మక మార్పు వచ్చింది. ఆటో కార్మికుల జీవితాలను రేవంత్ రెడ్డి ఆగం చేశాడు. రేవంత్ రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నాడు. కేసీఆర్‌పై చేస్తున్న అడ్డగోలు వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు వస్తోంది

## రేవంత్ వ్యాఖ్యలు దేశంలోని బీసీలను అవమానించడమే

(మొదటి పేజీ తరువాయి)

పట్టించేందుకే నరేంద్ర మోదీ కులాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. మోదీ బీసీ కాదనడానికి ఆధారాలు లేకపోయినప్పటికీ ఆ అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశంలోని బీసీలను అవమానించడమే అన్నారు. ఇందుకు ఆయన క్షమాపణలు చెప్పాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కమిషన్‌కు మోదీ రాజ్యాంగ బద్ధత కల్పించారని, విస్తృత అధికారాలు ఇచ్చారని, దేశంలో బీసీలకు రక్షణ కల్పించడానికి మోదీ చర్యలు చేపట్టారని ఆయన అన్నారు.





# బీఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్సీ కవిత

### కొయ్యలగూడెంలో ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం, సన్మానం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత శనివారం ఖమ్మం వెళుతున్న సందర్భంగా చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం గ్రామ సమీపంలో విలేజ్ ఆహారం హెూటల్ వద్ద మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కవిత హెూటల్ లో పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలలో విజయం సాధించేలా ఇప్పటినుండే ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కవిత సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి బొల్లా శివశంకర్, మాజీ సర్పంచ్ లు రిక్కల ఇందిరా సత్తిరెడ్డి, సుర్వి యాదయ్య గౌడ్, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు కొత్త పర్వతాలు యాదవ్, సమితి మాజీ జిల్లా డైరెక్టర్ ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, మాజీ గ్రంధాలయ చైర్మన్ ఊడుగు మల్లేశం గౌడ్, పన్నాల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావద్దు

- మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- పేద విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ,ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** నల్లగొండ విద్యార్థులు చెడు అలవాట్లకు, సెల్ ఫోన్ కు బానిసలు కావద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు అన్నారు. శనివారం రాత్రి నల్ల గొండ పట్టణంలోని ఎంవీఆర్ స్కూల్లో వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు బానిసలుగా మారితే జీవితం అంధకారంగా మారుతుంది అన్నారు.

విద్యార్థులు మంచిగా చదువుకొని తాము చదువుకున్న పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

పేద విద్యార్థులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటారని స్పష్టం చేశారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు ఆర్థికంగా సహాయం చేస్తూ చేయూతనందించడం జరుగుతుందని పేర్కొన్నారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా పేదలకు, పేద విద్యార్థులకు సేవ చేస్తానని స్పష్టం చేశారు.

నిరుద్యోగ యువత కోసం నల్లగొండలో స్కిల్ డెవలప్మెంట్ కు భవనాన్ని శంకుస్థాపన చేయడం జరిగిందని,త్వరలోనే దాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. తనను ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నల్లగొండ నియోజక వర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు. మంత్రిగా నలగొండను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎంజి యూనివర్సిటీ, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంజి యూనివర్సిటీలో రూ.80 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువచ్చి బ్రాహ్మణ విలయంలో ప్రాజెక్టును ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కొలనుపాక గీతా రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### తమిళనాడులో బుల్లెట్‌పై తిరుగుతున్నాడని

# దళితుని రెండు చేతుల నరికివేత

- దళిత యువకుని చేతులు నరకడం దుర్మార్గపు చర్య
- కులోన్మాదులను కఠినంగా శిక్షించాలి
- 10 కోట్ల పరిహారం అందించాలి.
- కత్తుల లింగస్వామి రాష్ట్ర కమిటీ సభ్యులు
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం



**చిట్యాల ఫిబ్రవరి 15 వార్తా వేదిక సూర్య**

తమిళనాడు రాష్ట్రం శివగంగా జిల్లాలో దళిత యువకుడు అయ్యస్వామి బుల్లెట్ బైకును కొనుగోలు చేసి నడుపుతుంటే జీర్ణించుకోలేని అగ్రవర్ణ ఆధిపత్య యువకులు పాశవికంగా ఆ యువకుని రెండు చేతులను నరకడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి అన్నారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా దళితులను ఇంకా మనుషులుగా చూడడం లేదని ఈ వివక్షతలను రూపుమాలపాల్సిన పాలకులే పెంచి పోషిస్తున్నారనీ కత్తుల లింగస్వామి అన్నారు.

ఈ దేశంలో మోడీ మతోన్మాదాన్ని తీవ్రంగా పెంచి పోషిస్తున్నాడని మోడి మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత దళితులపై దాడులు తీవ్రమ య్యాయని అన్నారు.మన్మధర్మ శాస్త్రం సూచించిన వర్ణ వ్యవస్థను అమలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు.ఉత్తర భారత దేశంలో దళితులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి అన్నారు. అదేవిధమైన పరంపరను కొనసాగించడానికి దక్షిణ భారతదేశంలో బీజాలు వేస్తున్నారన్నారు. మతపరమైన దాడులపై స్పందించినంత వేగంగా కులోన్మాధ దాడులపై ఈ పాలకులు స్పందించడం లేదన్నారు.బుల్లెట్ బైక్ పై తిరిగి అర్హత ఈ దేశంలో దళితులకు లేదా అన్నారు.భారత రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు దళితులకు వర్తించవా అన్నారు.దళిత యువకుని చేతులు నరికిన ఆధిపత్య వర్గాల యువకులను ఫాస్ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి 45 రోజుల్లో కఠినమైన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు న్యాయవ్యవస్థ త్వరితగతిన శిక్షల విధించకపోవడం తోనే దళితులపై ఆధిపత్య కులాలు మరింత పెట్రేగిపోతున్నాయని వారన్నారు. సమసమానత్వాన్ని నెలకొల్పాల్సిన పాలకులు అసమానత్వలను సృష్టిస్తున్నారని ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఈ వివక్షతలు మంచిది కాదన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### చౌటుప్పల్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఘన స్వాగతం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాదు నుండి నల్లగొండకు వెళ్తున్న సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని లింగోజిగూడెం గ్రామం వద్ద కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కి బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ అప్పటి బిఆర్ఎస్ పదేండ్ల పాలనపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత కంటే ఇప్పటి కాంగ్రెస్ పాలన పట్ల ఎక్కువ వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేంద్ర మంత్రి వెంట పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి రాగా ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కైరంకొండ అశోక్, పార్టీ సీనియర్ నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, మునగాల మహిపాల్ రెడ్డి, దాసోజు బిక్షమాచారి, ఆలే చిరంజీవి, బత్తుల జంగయ్య గౌడ్, పోలోజు శ్రీధర్ బాబు, ఆలె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.








### స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

# గుణపాఠం చెప్పాలి

### - బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నిరంజన్ గౌడ్

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** ప్రతాప్లి ఎన్నికల్లో లబ్ధి కోసం అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని చౌటుప్పల్ మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నకొండరు గ్రామంలో శనివారం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లీ మాల్ రెడ్డి, అల్మాస్ పేట కృష్ణ, కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, మెట్టు మహేశ్వర్ రెడ్డి, చెక్క రాములు, గరిసే జంగయ్య, దోర్నాల సత్తయ్య, బోయి నరసింహ, బండ్ల శ్రీకాంత్, మధు, ఎర్రల స్వామి, దోర్నాల నరేష్, గడగోట్టి నరసింహ, చంద్రం, నరసింహ, దోర్నాల నరేష్, మేకర్ శ్రీశైలం, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆశాజ్యోతి ధర్మభిక్షం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):**

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం నడిపిన స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మ బిక్షం అని సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. ధర్మబిక్షం 103వ జయంతి సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ధర్మ బిక్షం చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ




సందర్భంగా పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం నైజాం నవాబును ఎదిరించి తెలంగాణను విముక్తి చేయడంలో ధర్మ బిక్షం పాత్ర మరువలేనిదని, వేలాది ఎకరాల భూమిని భూస్వాముల నుండి పేదలకు పంచారని, భారతదేశంలో గీత వృత్తి రక్షణకై గీసే వానికి చెట్టు అనే నినాదంతో గీత కార్మికులకు అండగా నిలబడ్డారని, నల్లగొండ జిల్లాలో విద్యార్థి సంఘాన్ని స్థాపించి హాస్టల్‌ను ఏర్పాటుచేసి అనేకమంది విద్యార్థుల్ని చైతన్యం చేసిన నాయకుడు ధర్మబిక్షం అన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యునిగా ఈ ప్రాంత ప్రజల సాగు, తాగునీరు సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, నాయకులు ఉడత రామలింగం, నీళ్ల బిక్షపతి, కొండూరు వెంకటేష్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

### జ్ఞానాన్వేషణకై మనస్సును

# కేంద్రీకరించాలి : శ్రీరాములు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్, బడుగు రామస్వామి కమలమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్నే శివకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో




ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్వేషణ కొరకు మనసును పాఠ్యాంశములపై శ్రద్ధ వహించాలన్నారు. విజ్ఞత, వివేకం సమకాలీన విజ్ఞానం పెరగడానికి ఈ క్విజ్ పోటీలు దోహదం చేస్థాయన్నారు. పాలకూర శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళీగౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవిత లక్ష్యం అనే శిల్పానికి శిల్పులు విద్యార్థులే అన్నారు. పుస్తక పటనం లోనే అనుక్షణం ఆనందాన్ని పొందాలన్నారు. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకొని లక్ష్యసాధనకై కృషి చేయాలన్నారు. ఈ పోటీలలో 13 బృందాలు పాల్గొనగా విజేతలకు పుస్తక గుచ్ఛాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి : బొల్లు యాదగిరి డిమాండ్

**మోత్కూరు, ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య)**
కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల హామీలో భాగంగా అన్ని మున్సిపల్ పట్టణాల్లో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి, అమలు చేసి పేదలకు పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మోత్కూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య కాలనీలో ఇంటింటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకొని వారికి వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వాన్ని చేర్పించారు.

ఈ సందర్భంగా బొల్లు యాదగిరి మాట్లాడుతూ చిన్న చిన్న పట్టణాలను మున్సిపల్ పట్టణాలుగా ప్రకటించడం వల్ల అనేకమంది వ్యవసాయ కూలీలకు, పేదలకు సరైన పనులు లేక అనేక ఇబ్బందులు పడుతూ అర్ధకాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను బంద్ చేసి పేదలని ఇబ్బంది పెడుతుందని మేం అధికారంలోకి వస్తే అన్ని మున్సిపల్ పట్టణాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారం చేపట్టి ఏడాది దాటినా ఎందుకు అమలు చేయటం లేదని యాదగిరి ప్రశ్నించారు. వ్యవసాయ పనుల సీజన్ సందర్భంగా పట్టణానికి సంబంధించిన పేదలు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు అయిపోయిన తర్వాత పట్టణాల్లో పనులు లేక కుటుంబాలను పోషించుకుని ఇంటి అద్దెలు చెల్లింపులు, విద్య వైద్యం విషయంలో కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రసుతం ఉపాధి లేక అవకాశాలు పట్టణ పేద ప్రజలు నాణ్యమైన జీవన ప్రమాణాలను అందుకోవాలంటే పట్టణాలలో కచ్చితంగా జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ బడ్జెట్లో రూ. 2.5 లక్షల కోట్లు ఉపాధి హామీకి కేటాయించాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, కనీస కూలీ రోజుకు 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో వీటి సాధన కోసం పేదలను సమీకరించి పోరాటాలు కొనసాగిస్తామని యాదగిరి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు కందుకూరు నర్సింహ, పట్టణ కమిటీ సభ్యులు గుండు లక్ష్మి, తీగల్ల సావిత్రి, ఎస్. శోభ, ఎండి. తహరా, నాగమ్మ , వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యం శ్రేయస్సుపై జాతీయ సమావేశం

**భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 15 ( వార్త వేదిక సూర్య):**
భూధాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖ్ విజ్ఞాన్స్ యూనివర్సిటీ (హైదరాబాద్)లో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మెనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ అఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో "యువతలో మానసిక ఆరోగ్యం శ్రేయస్సు" అంశం మీద వికసిత్ భారత్ఏ2047 లక్ష్యంలో భాగంగా జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సులో ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు . సోషల్ సైన్సెస్ రీసెర్చ్ అంశాలే లక్ష్యంగా ఐసీఎస్ఎస్ఆర్ పనిచేస్తోందని అన్నారు. ఎన్నో పరిశోధానాత్మక ప్రాజెక్టులకు ఇది ఆర్థికంగా తోడ్పాటునిస్తోందని చెప్పారు. ప్రస్తుతం విద్యాసంస్థలు కేవలం కంటెంట్ ట్రాన్స్ఫార్మింగ్ ఇన్స్టిట్యూట్లుగానే ఉన్నాయని.. ఇలా కాకుండా కంటెంట్ జనరేటర్లుగా విద్యాసంస్థలు మారాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజ(హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్ సైకాలజీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) జాతీయ స్థాయి సమావేశంలో మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యం, మానసిక సంక్షేమం యెక్క ఆవశ్యకత మరియు ప్రాధాన్యతను నేటి యువత






గుర్తించాలని సూచించారు.

సమావేశంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. సమాజానికి దోహదపడే అంశం మీద నిర్వహిస్తోన్న జాతీయ స్థాయి కాన్ఫరెన్స్కు నిధులు సమకూర్చినందుకు ఐసీఎస్-ఎస్ఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కాన్ఫరెన్స్లో వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొన్న వారికి పరిశోధక పత్రాలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ కల్పన కోనేరు, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ సరిత సత్పతి, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ సురేశ్ చంద్ర, డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సునీల్, ప్రొఫెసర్లు డాక్టర్ సయ్యద్, డాక్టర్ అమీనా, డాక్టర్ లాల్ ఒకామా పాల్గొన్నారు.

# మోత్కూరు బిక్కేరు వాగులో ఎమ్మెల్యే సామేల్ జలపూజ

**మోత్కూరు, ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య):**
గంధమల్ల రిజర్వాయర్ నుంచి మోత్కూరు బిక్కేరు వాగులోకి గోదావరి నీరు రావడం పట్ల తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బిక్కేరు వాగు వద్ద జల పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా బిక్కేరు వాగులో వేసవికాలంలో నీరు రాలేదని...నేడు భూగర్భజలాలు ఎండిపోయి రైతులకు వరిపంట నష్టపోతున్నదని తమ దృష్టికి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు సమస్యను వివరించి గంధమల్ల రిజర్వాయర్ నుంచి గోదవరి జలాలు మోత్కూరు, అడ్డగూడూరు ప్రాంతాల్లో నీటికి వధాలని తమ కోరిక"ను వెంటనే నెరవేర్చిన ముఖ్యమంత్రి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తాను రైతు బిడ్డను అని ఏ సమస్యనైనా ప్రజలు , రైతులు తమ దృష్టికి తీసుక వస్తే సాధ్యమైయ్యేంత వరకు కృషి చేస్తానని భరోషా కల్పించారు .

అర్చకులు పారునంది సూరిబాబు శర్మ వేదమంత్రలతో బిక్కేరు వద్ద ప్రజలు పడి పంటలతో వర్థిలాలని అంటూ జలపూజను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం కవిత,



మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, నాయకులు బయ్యని రాజు, గనగాని నర్సింహ్మా, మందుల సురేష్, పల్లపు సమ్మయ్య, లెంకల వేణు ముద్దం జయశ్రీ, కురిమిళ్ల ప్రమీల, రైతులు నిలిగొండ అంజయ్య, కురిమిళ్ల రమేష్, బుర్ర నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూరు బిక్కేరువాగులోకి గోదావరి తీసుకొచ్చిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చిత్రపటానికి పాలాభిషేకం

**మోత్కూరు ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మండలంలోని బిక్కేరువాగులోకి గోదావరి జలాలు తీసుకువచ్చిన స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ చితపటానికి రైతులు పట్టణ కాంగ్రెస్ కమిటీ పక్షాన పాలాభిషేకం చేశారు.
ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లిగుండగొని రామచంద్రు గౌడ్ మాట్లాడుతూ మండు వేసవిలో భూగర్భజలాలు అడిగంటి పోతున్నాయని తెలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , రోడ్డు భవనాల శాఖ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో బిక్కేరు వాగు గోదావరి జలాలు తీసుకవచ్చిన ఘనత సామేల్ కె దక్కుతుందన్నారు. పాడి పంటలకు గోదావరి జలాలు తీసుకవచ్చి మరో భగీరధునిగా ఎమ్మెల్యే మందుల సామెల్ రైతుల గుండెల్లో నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా మా ప్రాంత అభివృదికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృత్ణతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అవిశెట్టి అవిలిమల్లు,యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల



సురేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,బయ్యని రాజు, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుంకిషాల అనిల్,గుండు శ్రీను,అన్నెపు నర్సింహ్మా, పల్లపు సమ్మయ్య,మెంట నర్సింహ్మా, పల్లె భిక్షం, కోమటి జనార్ధన్, బందేల రవి, దొంతోజు సోమలింగం చారి, కూరెళ్ళ పక్కీరు, పల్లపు శ్రీరామ్,మత్స్య గిరి, సూధగాని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిక్కేరు వాగును సందర్శించిన ప్రభుత్వ విప్ అయిలయ్య

**మోత్కూరు ఫిబ్రవరి 15( వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మండల కేంద్రంలో బిక్కేరు వాగులో పారుతున్న గోదావరి జలాలను శనివారం నాడు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య సందర్శించారు. శనివారు గుండాల నుంచి ఆత్మకూరు (ఎం) మండల పర్యటన వెళ్తున్న ఆయన మార్గ మధ్యలో ఈ బిక్కేరు వాగు వద్ద కాసేపు ఆగి రైతులతో ముంచ్చటించారు. బిక్కేరు వాగుపై ఆధారపడి సాగు చేస్తున్న వ్యవసాయం గురించి రైతులను ఆడిగితెలుసుకున్నారు బిక్కేరు వాగులో వేసవికాలం నీరు రావడంతో పంటలకు ఎలాంటి దోక లేదని 100% అన్ని రకాల పంటల వేసుకోవచ్చని సూచించారు. రైతు కళ్ళలో ఆనందం చూసిన విప్ బీర్ల అయిలయ్య కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండు సార్లు నీటిని విడుదల చేశామని ఇది రైతు ప్రభుత్వమని రైతు కళ్ళలో ఆనందం చూసి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ రైతు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని. అందులో మన ప్రాంతానికి రెండోసారి కూడా నీళ్లు విడుదల సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లకు అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, రైతులు దొండ నర్సయ్య, బుర్ర నర్సమ్మ, బుర్ర సుశీల తదితరులు పాల్గొన్నారు.






# నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత



**మోత్కూరు, ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య ):**
మోత్కూరు మండలం అనాజీపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చుక్క బిక్షపతి గుండెపోటుతో శనివారం నాడు ఆకస్మికంగా మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సుచిత్ర గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ,శివాని ఆర్ట్స్ అవార్డు గ్రహీత కోక బిక్షం ఆయన మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ కుటుంబాన్ని పరామర్శించి తక్షణమే 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, గ్రామస్థులు కొల్లు శంకర్, వెంకటయ్య, సత్యనారాయణ, రమేష్, శేఖర్ రెడ్డి, బర్రె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మబిక్షం గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : శ్రీనివాస్ గౌడ్

**మోత్కూరు ఫిబ్రవరి 15( వార్త వేదిక సూర్య):**
స్వాతంత్ర సమర యోధులు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ పార్లమెంట్ సభ్యులు ,బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్



పిలుపునిచ్చారు. శనివారం నాడు ధర్మభిక్షం 103 వ, జయంతి సందర్భంగా మోత్కూరులో శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి బీసీ రిజర్వేషన్ సాధన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ధర్మ బిక్షం తన చిన్నతనం నుంచే ఉద్యమాల లక్షణాలు అలవార్చుకొని భూస్వాముల పెత్తం దారులు వ్యతిరేకంగా పేదల పక్షాన నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి ధర్మభిక్షం అని ఆయన సేవలను కొనియాడారు. 3సార్లు, ఎమ్మెల్యేగా 2సార్లు ఎంపీ గా పోటీ చేసి దేశ రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. గీత కార్మికుల కోసం అనేక ఉద్యమాలు చేసి గీత హక్కులను సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వల్లాల నర్సయ్య, ఇటికాల నాగరాజు, బుర్ర నర్సింహ్మా, పురుగుల అనిల్, బీసు క్రిష్టయ్య, మల్లెబోయిన ఎల్లమ్మ, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

# బా.జ.పా.జిల్లా అధ్యక్షున్ని మర్యాద పూర్వకంగా కలిసిన మధుసూధన్

**మోత్కూరు ఫిబ్రవరి15 (వార్త వేదిక సూర్య):**
భారతీయ జనతా పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ నియామకం పట్ల భా.జ.పా మండల అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్ హర్ష వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు హైదరాబాద్ లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన అశోక్ గౌడ్ 30ఏళ్లుగా అంచలంచేలుగా ఎదిగి నేడు జిల్లా బాధ్యతలు స్వీకరించిన అశోక్ గౌడ్ నాయకత్వంలో జిల్లాలో భా.జ.పా బలోపతం కానున్నట్లు తెలిపారు



# రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**మోత్కూరు ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో నిర్మిస్తున్న మెయిన్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం నాడు మున్సిపల్ కమీషనర్ కె.సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నాణ్యత ప్రమాణాలను రోడ్డు పనులను త్వరగా



పూర్తి చేయాలని సంబంధింత అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఏ.ఈ. సురేష్, మున్సిపల్ సిబ్బంది నర్సింహ్మా చారి, రాంబాబు ఉన్నారు.






## వలిగొండ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**వలిగొండ ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** మండలంలో వివిధ పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులు శనివారం సమావేశం నిర్వహించి నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా శివనాదుల రమేష్, అధ్యక్షునిగా పెద్దిటి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గన్నెబోయిన నర్సింహా, ఎమ్మె బాల్ రాజు, ప్రధాన కార్యదర్శిగా డోగిపర్తి సంతోష్, కోశాధికారిగా రాపోలు పవన్ కుమార్, సహాయకార్యదర్శిగా కట్ట శ్రీను, సలహాదారులుగా గోద అచ్చయ్య, ఆలకుంట్ల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా కదిరెని సురేష్, దేసిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎల్లంకి రాజు, ఎర్ర శ్రీకాంత్, పల్లెర్ల సుధాకర్, వడ్డెమాను సురేష్ తదితరులను ఎన్నుకున్నారు.

## ఎమ్మెల్సీ కవితకి స్వాగతం పలికిన రామన్నపేట బిఆర్ఎస్ నాయకులు

**రామన్నపేట, ఫిబ్రవరి 15(వార్తా వేదిక సూర్య):**
రామన్నపేట మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో శనివారం చిట్యాల పట్టణ కేంద్రంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కల్వకుంట్ల కవిత ఖమ్మం పర్యటనకు వెళ్తుండగా కనకదుర్గ గుడి వద్ద ఆపి శాలువతో సత్కరించి పుష్పగుంచం అందించి స్వాగతం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం ,మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం ,మాజీ మార్కెట్ కమిటీ వైస్



చైర్మన్ లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, వేమవరం సుధీర్ బాబు ,గోరిగే నరసింహ, పున్న వెంకటేశం, మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి జిల్లా నాయకులు బద్దుల, రమేష్ ,ఎస్కె చాంద నాయకులు కునూరు ముత్తయ్య, జాడ సంతోష్, మిర్యాల మల్లేశం, దాసరి శ్రవణ్ రెడ్డి, బొడ్డు అల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బండ శ్రీనివాస్ రెడ్డి, గర్దాస్ విక్రమ్, జెట్టి సైదులు, బుర్ర శ్రీశైలం, గుండు రమేష్ నక్క నరేందర్, వంగాల యాదయ్య, ఎడ్ల రామచంద్రారెడ్డి, కన్నెబోయిన వెంకటేష్, బొడ్డుపల్లి రాజు, గర్దాస్ కరుణాకర్ ,మేడి రాజు, వంగాల సంపత్ ,స్వామి, బాబు ,గట్టు శేఖర్ ,గుండాల మల్లేశం ,కుక్కు సాయి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ గౌస్ మృతి దిగ్భ్రాంతికరం

**రామన్నపేట, ఫిబ్రవరి 15(వార్తా వేదిక సూర్య):**

రామన్నపేట ప్రజాపక్షం సీనియర్ జర్నలిస్ట్ ఎండి గౌస్ గుండెపోటుతో మృతి చెందడం దిగ్భ్రాంతికరమని, తన కుటుంబానికి తీరని లోటని శనివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. అనంతరం వారి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి 10వేల రూపాయల ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా సెక్రెటరీ గోదా శ్రీరాములు, నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దైద రవీందర్ గౌస్ మృతదేహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, మేక అశోక్ రెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణ,గుత్తా నర్సిరెడ్డి, వనం చంద్రశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, జెల్లా వెంకటేష్, ఎండి జమీరుద్దీన్, పెద్దగోని వెంకటేశం,రామిని రమేష్, ఎర్ర శేఖర్,కోట సుధాకర్, ఎండి అక్రమ్, గొలుసుల ప్రసాద్, కొమ్ము శేఖర్, గురుకుశివ తదితరులు ఉన్నారు.




# ధర్మబిక్షం సేవలు చిరస్మరణీయం

**మోత్కూరు ఫిబ్రవరి 15 (వార్త వేదిక సూర్య):**
పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన బహుజన బిడ్డ బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ సేవలు చిరస్మరణీయమని గీత పనివారాల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య అన్నారు. శనివారం నాడు 103 వ, జయంతి సందర్భంగా మోత్కూరులో గీత పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ భూస్వాముల పెత్తందారులకు, వ్యతిరేకంగా పేద వర్గాల కోసం పోరాటాలు నిర్వహించిన మహనీయులు ధర్మభిక్షం అని పేర్కొన్నారు. ఆనాడు రజాకార్ల ఎదిరించి భూమి, భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు..గీత కార్మికులు హక్కుల సాధన కొరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమ పోరు కొనసాగించిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య ,సిపిఐ మండల పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, పులకరవు మల్లేష్ మల్లెబోయిన అంజయ్య, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి ఎడ్ల



నరేష్,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బీసు సత్యనారాయణ, బోయిని వెంకన్న ,మల్లె బోయిన,బుచ్చయ్య ,బందారపు నర్సయ్య, బీసు వీరయ్య, చాపల మల్లయ్య ,కాటం యాదగిరి, మల్లె బోయిన మహేష్ , ఎడ్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ బిక్షం ఆశయాలను కొనసాగిస్తాం - పోలపాక యాదయ్య

**వలిగొండ ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మ బిక్షం ఆశయాలను కొనసాగిస్తామని సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య అన్నారు శనివారం మండల కేంద్రంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ అప్పటి నైజాం రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసిన గొప్ప మహా యోధుడని, పీడిత ప్రజల వెట్టి చాకిరి విముక్తికై పోరాటాన్ని కొనసాగించి ఆనాటి నైజాం నవాబును ఎదిరించిన వీర యోధులని కొనియాడారు.కొనియాదారు.

ఆర్య సమాజంతో పాటు 1940 విద్యార్థుల సమస్యలు,



దున్నేవాడికి భూమి అన్నట్లుగా గీసే వాడిదే చెట్టు అనే నినాదం కూడా ఇచ్చాడని తెలిపారు. అనేక ఉద్యమాలు చేసి ప్రజలను చైతన్య పరచి, రాచరిక వ్యవస్థను కూలదొయ్యడంలో ప్రముఖమైన నాయకులని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా , రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా, కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా ప్రజలకు అనేకమైన సేవలు అందించరాని అన్నారు.

తన జీవితకాలం పేద ప్రజల చైతన్యం కోసమే జీవించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మచ్చ లక్ష్మీనారాయణ, బొడిగ సుదర్శన్, పారుపల్లి నరసింహ, చొప్పరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధర్మభిక్షంగౌడ్ 103వ జయంతి వేడుకలు

**ఆత్మకూర్ (ఎం),ఫిబ్రవరి 15 వార్త వేదిక సూర్య:**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 103 వ జయంతి శనివారం ఆత్మకూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ధర్మ భిక్షం చిత్ర పటానికి మార్కెట్ ఛైర్మన్ నునేముంతల విమల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన మహాయోధుడు ధర్మబిక్షమని, పేద ప్రజల బాగు కోసం పనిచేసిన గొప్ప నాయకుడు ధర్మభిక్షం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోత్కుర్ వ్యవసాయ మార్కెట్ చెర్మన్ నూనెముంతలా విమల వెంకటేశ్వర్లు రాష్ట్ర నాయకులు బీసు చందర్ గౌడ్,గౌడ సంఘం అధ్యక్షులు పంజల నరసయ్య గౌడ్,మార్కెట్ డైరెక్టర్ బొడిగే నర్సింహ,పాశం వినోద,రంగ సత్యనారాయణ,గడ్డం దశరత,నాతి రాజు,ముద్దసాని సిద్ధులు, బత్తిని ఉప్పలయ్యపోతగాని మల్లేశం గౌడ్ ,బూడిది శేఖర్,పరకాల నర్సయ్య గౌడ్, రంగ శేఖర్ గౌడ్ రంగ స్వామి, చెరుకు శ్రీను,రాగటి స్వామి సత్యనారాయణ, పరకాల రాంబాబు, శివలింగం బిక్షపతి ,తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో బొమ్మగాని ధర్మ బిక్షం 103వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**దేవరకొండ ఫిబ్రవరి 15 న్యూస్ (వార్తా వేదిక సూర్య):**
స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు,మాజీ ఎంపీ,ఎమ్మెల్యే, ప్రజల మనిషి, అనునిత్యం పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి,గీత కార్మికుల గొంతుకై నినదించిన కామ్రేడ్ బొమ్మగాని ధర్మబిక్షం గారి 103వ జయంతి ఉన్నాడు కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవనంలో జరుపుకోవడం జరిగినది.

ఈ సందర్భంగా దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్లో సిపిఐ,గీత పనివారుల సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి,గీత పనివారుల సంఘం




డివిజన్ కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్.. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి మాట్లాడటం ధర్మ బిక్షం తెలంగాణ సాయుధ పోరాటం పేద ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నైజాం కు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన వ్యక్తి కామ్రేడ్ బొమ్మగాని ధర్మం బిక్షం గారు

ఈ కార్యక్రమంలో దేవరకొండ సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు,సిపిఐ పట్టణ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు,మండల కార్యవర్గ సభ్యులు గంగిడి రాంరెడ్డి,నీలా వెంకటయ్య,ఎండి మైనోద్దీన్,కిన్నెర యాదయ్య, సిపిఐ,గీతా పనివారాల సంఘం నాయకులు కాటం జక్కా మాధవరెడ్డి గోవర్ధన్,తోటపల్లి నాగేష్, జూలూరి జ్యోతిబస్, కిన్నెర బారిములు,కందుకూరి శ్రీను, ఏశామోని మల్లేష్,గంగలి పార్వతాలు, సంకెపల్లి మోహన్ రెడ్డి,కానమోని వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ 286 జయంతి సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం

**దేవరకొండ ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనమునందు అధ్యక్షుడు NVT ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, సభ్యులతో కలిసి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సభ్యులతో కలిసి మొక్కలు నాటినారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు %చీమ% మాట్లాడుతూ గిరిజన బంజారాలకు పురాతన సంస్కృతిని పరిచయం చేస్తూ, జీవహింస మాంసం తినటం వంటి పనులకు దూరంగా ఉండాలని సూచించారు. బంజారాలకు ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. మొక్కల గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందల షాపుల ముందల రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటాలని, తమ వంతు బాధ్యతగా నీరు పోసి కాపాడుకోవాలని అన్నారు.



మొక్కలు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తాయి, ఓజోన్, రేణువుల వంటి వాయు కాలుష్యాలను తగ్గిస్తాయి,
అడవులు సహజ ఫిల్టర్లుగా పనిచేస్తాయి.
నేల ఆరోగ్యంమొక్కలు ఆకులు, సేంద్రియ పదార్థాలను చిందించడం వల్ల నేలను సుసంపన్నం చేస్తాయి.
జీవవైవిధ్యంమొక్కలు అనేక జంతువులకు ఆశ్రయం కల్పిస్తాయి.
మొక్కలు తినడానికి ఆహారాన్ని అందిస్తాయి.
మొక్కల నుండి ఔషధాలు తయారు చేస్తారు.
మొక్కల నుండి కలపను పొందుతారు, దీనిని శక్తి యొక్క ప్రత్యామ్నాయ వనరుగా ఉపయోగిస్తారు.
ఇంట్లో మొక్కలు పెంచడం వల్ల ఆక్సిజన్ విడుదల అవుతుంది, ఇది ఆరోగ్యానికి మంచిది.
మొక్కలు చూడటం, వాటిని పెంచడం వల్ల ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం లభిస్తుంది.
మొక్కలు పర్యావరణాన్ని సంరక్షిస్తాయి అని ఈ సందర్భంగా వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, వేముల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్ల సురేష్, బొడ్డుపల్లి కృష్ణ, కరాటే మాస్టర్ శ్రీను, పగిడిమర్రి శ్రీనయ్య, చంద్రశేఖర్, డాన్స్ మాస్టర్ జగన్, సన్నీ కరెంట్ ఆఫీస్, నాగరాజు, నరేష్, హరికృష్ణ, రమేష్, కృష్ణ, క్రీడాకారులు కళాకారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు

**దేవరకొండ ఫిబ్రవరి 15(వార్తా వేదిక సూర్య):**
దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శ్రీ శ్రీ సంత్ సద్గురు సేవలాల్ మహారాజ్ 286వ జయంతిని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కొండ మల్లేపల్లి మండల అధ్యక్షులు లాలు నాయక్,ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్,ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సేవా లాల్ మహారాజ్ చిత్రపటాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించారు తదు అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి మల్లెల గుట్టపై ఉన్న బంజారా భవన్ దగ్గర భోగ్ బండారు కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కొండమల్లేపల్లి పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కాసార్ల వెంకటేశ్వర్లు,బక్కులు, బూడిద మల్లేష్, మండల కేంద్రంలోని ఉన్న బంజారా మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు, మాజీ వార్డ్ సభ్యులు 26 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన బంజారా నాయకులు, బావోజీలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ, ఫిబ్రవరి 15, (వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రం చెందినఅనిత రెడ్డి – తిరుమల రెడ్డి గార్ల కూతురు (హనిష రెడ్డి)వివాహా మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం నాడు హైద్రాబాద్ లోని ఇబ్రహీంపట్నం కొంగరకలాన్ PSR శ్లోక కన్వెన్షన హాల్‌లో జరిగిన వివాహా మహోత్సవ వేడుకల్లో




పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

ఈ కార్యక్రమంలో మాజీ పీఏ పల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్ రెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల ఏడుకొండల్, యాదవ్ నరేందర్ రెడ్డి, వీర రెడ్డి, దామోదర్ రెడ్డి,తిరుమల రెడ్డి గారి కుటుంబ సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాందీప్ హైస్కూల్లో స్వపారి పాలన దినోత్సవం

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 15, (వార్త వేదిక సూర్య):**

నల్లగొండ పట్టణంలోని సందీప్ స్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా కొత్తగా తమ ఒక్కరోజు ఉపాధ్యాయ పాత్రను ఎంతో సంతోషంతో నిర్వహించారు. పి దీప. ఆర్ జె డి. గా, పి లావణ్య. కలెక్టర్గా, బి



రితిక. డీఈఓ, టి జయ ప్రసన్న.ఎం ఈఓగా , టి వర్షిని. కరెస్పాండెంట్ గా ,రుత్విక్ రెడ్డి. హై స్కూల్ ప్రిన్సిపాల్ గా., ఎండి ఆమన్ అలీ.ప్రేమం ప్రిన్సిపాల్ గా., కృష్ణ చైతన్య. తమ ఒక్కరోజు బాధ్యతలను చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాందీప్ పాఠశాల వ్యవస్థాపకులు గానూతుల సత్యనారాయణ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్ప వృత్తి అని సమాజాన్ని తయారుచేసే గొప్ప శక్తి ఉపాధ్యాయుడిదికే ఉన్న దని అందరూ గొప్ప వాలుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ ఈ సోపరిపాలన దినోత్సవం లో పాల్గొన్న విద్యార్థులు ఉపాధ్యాయులను అభినందించారు..



## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

**కుటుంబ సమేతంగా దైవ దర్శనం**

**నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్**

**చింతపల్లి మాజీ జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంక రెడ్డి**

**దేవరకొండ ఫిబ్రవరి 15 న్యూస్ (వార్తా వేదిక సూర్య):** దైవ చింతనతో మానసిక ప్రశాం తత కలుగుతుందని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ చింతపల్లి మాజీ జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో సాయినాథుని కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శనం చేసుకొన్నారు.ద్కెవ దర్శనం మనసుకు ఉల్లాసాన్ని, సంతోషాన్ని కలిగించింది. కొత్త ఉత్సాహం,ఉత్తేజం నిలువెల్లా నింపింది. ద్కెవ సన్నిధి మా అందరికీ మధురానుభూతి కలిగించిందన్నారు.



విలేకరులు కావలెను:

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

సోల్లేటి గోవర్ధనాచారి
యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.
9848246781

పోలోజు శ్రీనివాసాచారి
చైర్మన్ & ఎడిటర్.
9985389183





# బీఆర్ఎస్ పాలన కంటే సంవత్సరం కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సరోత్తంరెడ్డి ని గెలిపించాలి**

**రు.ఏడు వేల కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని ప్రారంభించాం**

**వచ్చే ఏడాది వరంగల్ లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు**

**రు.నాల్గు వేల కోట్లతో అమృత్ పథకం కింద మున్సిపాలిటీల అభివృద్ధి**

**రు.1366 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్ ఏర్పాటు**

**కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**

**నల్గొండ బ్యూరో,ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** కాంగ్రెస్ పాలనపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు.వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం నల్లగొండ పట్టణానికి వచ్చిన ఆయన బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత కంటే సంవత్సరం పాలనలో కాంగ్రెస్ పార్టీపై వచ్చిన వ్యతిరేకత మరింత ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గాల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో బలమైన వాదనను వినిపించే సత్తా ఉన్న సరోత్తంరెడ్డిని వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని



కిషన్ రెడ్డి కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో రేవంత్ రెడ్డి సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

రైతు రుణమాఫీ, మహిళలకు నెలకు రు.2500 వేస్తానని ఇచ్చిన హామీని,వృద్ధాప్య పెన్షన్ ను నెలకు రూ.నాల్గు వేలకు పెంచుతానని ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రేవంత్ రెడ్డి సర్కారు ప్రజలను దగాకు గురి చేసిందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు. తెలంగాణలో మూతపడ్డ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కేంద్రం రు.ఏడు వేల కోట్లు ఖర్చు చేసి పునః ప్రారంభించిందని చెప్పారు.రు.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం నుండి ఐదు వందే భారత్ ట్రైన్ లను కేంద్రం నడుపుతోందని ఆయన గుర్తు చేశారు.రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం రూ.నాల్గు వేల కోట్లను అమృత్ పథకం కింద ఖర్చు చేసినట్లు ఆయన చెప్పారు.కిసాన్ సమ్మాన్ పథకం కింద ఆరు నెలలకు ఓసారి రైతుల అకౌంట్లలో పంట సాయం అందిస్తున్నామని చెప్పారు.నిధుల సమస్యతో మధ్యలోనే ఆగిపోయిన 11 ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సహాయం అందించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 14,15వ ఫైనాన్స్‌ల క్రింద గ్రామపంచాయతీలు, స్మశాన వాటికల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో నిర్మించిన రైతు వేదికల భవనాలన్నీ కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన వేనని కిషన్ రెడ్డి తెలిపారు.పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో రు.1366 కోట్లతో బీబీనగర్ వద్ద ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మించినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి,కాసం వెంకటేశ్వర్లు,గోలి మధుసూదన్ రెడ్డి,ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్ రెడ్డి,బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే పనిలో బిజెపి ప్రభుత్వం

**రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేదు**

**అన్నివిద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలే అన్ని**

**ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్**

**దేవరకొండ ఫిబ్రవరి 15 న్యూస్,(వార్త వేదిక సూర్య):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగానికి కాషాయ రంగును పులిమి కార్పొరేట్ శక్తులకు అప్పగించే పనిలో ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




శనివారం కొండమల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాస చారీ సార్ చేతుల మీదుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా మహాసభల గోడ పోస్టర్ ఆవిష్కరించారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఈనెల 19, 20 తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో జరిగే ఎస్.ఎఫ్.ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సుదీర్ఘంగా చర్చించి, గత సంవత్సర కాలం పాటు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన విద్యార్థి ఉద్యమాలను నెమరు వేసు కుంటూ సాధించిన విజయాలు జరిగిన లోటు పాట్లను అధిగమించడం కోసం భవిష్యత్ కార్యాచరణ నిర్దేశించుకోవడం కోసం ఈ మహాసభలు వేదిక కానున్నాయని అన్నారు. నల్గొండలో జరిగే జిల్లా మహాసభలకు నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రతినిధులు సుమారు 200 మంది ఈ మహాసభల్లో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఎస్.ఎఫ్.ఐ నల్గొండ జిల్లా కమిటీ ఇటీవల కాలంలో అనేక ఉద్యమాలు నిర్వహించిదని, ముఖ్యంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు మెస్ కాస్మోటీ ఛార్జీలు పెంచాలని, నల్లగోండ జిల్లా వ్యాప్తంగా మోటార్ సైకిల్ యాత్ర లు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. వసతి గృహ విద్యార్థులకు సొంత భవనాలు కట్టించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ

గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరుగుతున్న ఫుడ్ పాయిజన్, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ కై జిల్లా కలెక్టరేట్ లో విద్యార్థి మహాగర్జనలు, క్లాక్ టవర్ సెంటర్ లో దీక్షలతో ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని వివరించారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం గత బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగంలోకి మతోన్మాద కషాయికరణ భావజాలను తెప్పించడం కోసం విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం ఎంతవరకు సరైనదో చెప్పాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్.ఎఫ్.ఐ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు కావాలి కాంగ్రెస్ కావాలని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటాయి. చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని, మండిపడ్డారు. విద్యారంగ సమస్యల సాధనకు ఎస్.ఎఫ్.ఐ సమరశీల రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ డివిజన్ కార్యదర్శి బూడిగ వెంకటేష్ జై చరణ్ నతనియల్ సురేష్ రాము దాసు మల్లేష్ రాజు పావని మంజుల రోజా నందిని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు





# శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ ఫిబ్రవరి 15(వార్తా వేదిక సూర్య):** గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గారి జయంతి పురస్క రించుకొని శనివారం నాడు హైద్రాబాద్ బంజారాహిల్స్ లోని బంజారా భవన్ లో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క మంత్రి సీతక్క గారు,ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి గారు, సహచర బంజారా ఎమ్మెల్యేలు,ఎంపీలు,బంజార నాయకులు,బంజార ప్రజా ప్రతినిధులతో కలిసి జయంతి వేడుకల్లో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయం అని అన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గారు,సమాజానికి ఆయన చేసిన సేవలు మరవరానివి అన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది అని అన్నారు. సిఎం శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో బంజారల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అదే విధంగా శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం %వాదీ% స్టేడియంలో నిర్వహించాలి అని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క ,మంత్రి సీతక్క గారు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి గారు,ట్రైకర్ ఛైర్మెన్ బెల్లయ్యా నాయక్ ,బంజార MP లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,బంజార ఉద్యోగ సంఘాల నాయకులు,గిరిజన విద్యార్థి సంఘం నాయకులు,మహిళలు తదితరులు క్రమంలో పాల్గొన్నారు.

# కోనేరు యాదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు అభిషేక్ నాయక్

**దేవరకొండ ఫిబ్రవరి 15 (వార్తా వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండలం పరిధిలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన కోనేరు ఆంజనేయులు గత నాలుగు రోజుల కిందట అనారోగ్యానికి గురై మృతి చెందడం బాధాకరమని అని బిఆర్ఎస్ పార్టీ మండల యువనాయకులు అభిషేక్ నాయక్ అన్నారు.శనివారం పెండ్లిపాకల గ్రామములో కోనేరు యాదమ్మ కుటుంబ సభ్యులను అభిషేక్ నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి 8000



రూపాయల ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం అందిచడం జరిగింది.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు ఏటెల్లి రాంబాబు, పిల్లి పరమేష్, బీనమోని ఎల్లయ్య ,నేతల్లా లింగం,నేతల్లా కొండల్, మేకల సందీప్,బీనమోని ఆంజనేలు,గుండాల వెంకట్, గుండ్ల రమేష్, బీనమోని సాలయ్య, మేడం యాదయ్య ,ఏడ్పుల ఆంజనేలు,కావటి వెంకటేష్, హరికృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కిరణ్ అబ్బవరం “దిల్ రూబా”

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా “దిల్ రూబా” మార్చి 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ సినిమాలో రుక్సర్ థిల్లాన్ హీరోయిన్ గా నటిస్తోంది. “దిల్ రూబా” చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్ మరియు ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ కు రావాల్సిన “దిల్ రూబా” సినిమా బెటర్ ఔట్ పుట్ కోసం పోస్ట్ పోన్ అయ్యింది. మార్చి 14న ఈ సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఈ రోజు ప్రకటించారు. ప్రమోషనల్ కంటెంట్ తో “దిల్ రూబా” మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. “క” మూవీ బ్లాక్ బస్టర్ తర్వాత కిరణ్ అబ్బవరం మంచి ఫామ్ లోకి వచ్చారు. ఈ నేపథ్యంలో “దిల్ రూబా” సినిమాపై అన్ని వర్గాల ప్రేక్షకుల్లో హై ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.



## మ్యాసీవ్ సెట్‌లో మెగాస్టార్ ఇంట్రో సాంగ్

మెగాస్టార్ చిరంజీవి హైలీ యాంటిసిపేటెడ్ సోషియో-ఫాంటసీ ఎంటర్టైనర్ ‘విశ్వంభర’ సినిమా టీజర్ విడుదలైన తర్వాత హ్యూజ్ బజ్ క్రియేట్ చేసి, ఈ సినిమా కోసం రూపొందించిన మెస్మరైజింగ్ వరల్డ్ కోసం ఓ అవగాహన కల్పించింది. ప్రతిష్టాత్మక యువి క్రియేషన్స్ బ్యానర్ పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా గ్రేట్ విజువల్ వండర్‌గా రూపొందుతోంది. సినిమా ప్రొడక్షన్ పూర్తి కావస్తోంది, తాజా షెడ్యూల్‌లో చిరంజీవి ఇంట్రడక్షన్ సాంగ్ హైదరాబాద్ లోని శంకర్ పల్లిలో ఒక అద్భుతమైన సెట్ లో చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్ ఓ మ్యాసీవ్ సెట్ ని రూపొందించారు. ఎంఎం కీరవాణి ఈ పాట కోసం పవర్ ఫుల్ మాస్ అంథమ్ కంపోజ్ చేయగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం రాశారు. ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ శోభి మాస్టర్ డ్యాన్స్ మూమెంట్స్ ని పర్యవేక్షిస్తున్నారు. సాంగ్ షూట్ నుంచి విడుదలైన ఇమేజ్ చిరంజీవిని కూల్ అండ్ స్టైలిష్ గా, షేడ్స్‌తో కారు దిగి షార్ప్ లుక్స్ తో ప్రజెంట్ చేస్తోంది. బ్లాక్‌బస్టర్ బింబిసారతో అద్భుతమైన అరంగేట్రం చేసిన దర్శకుడు వశిష్ట ‘విశ్వంభర’ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. ఇది తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు.

## అనిరుధ్ సంగీతం అందిస్తున్న ‘మ్యాజిక్’

ఒక వైపు భారీ సినిమాలను రూపొందిస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్యభరిత చిత్రాలను అందిస్తూ ఘన విజయాలను సొంతం చేసుకుంటోంది ప్రముఖ నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. ప్రస్తుతం ‘జెర్సీ’ వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ‘మ్యాజిక్’ అనే సినిమాను సితార సంస్థ రూపొందిస్తోంది. ఈ మ్యూజికల్ డ్రామాలో పలువురు యువ నటీనటులు నటిస్తున్నారు. ‘మ్యాజిక్’ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి ‘డోంట్ నో వై’ అనే మొదటి గీతాన్ని విడుదల చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా అనిరుధ్ పాట విడుదలై ఆకట్టుకోవడం కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ‘డోంట్ నో వై’ పాటతో మరోసారి కట్టిపడేశారు అనిరుధ్. ‘మ్యాజిక్’ అనే చిత్ర టైటిల్ కి తగ్గట్టుగానే తన మ్యూజిక్ తో మ్యాజిక్ చేశారు అనిరుధ్. ఆ సంగీతానికి తగ్గట్టుగానే, ఆకట్టుకునే విజువల్స్ తో ‘డోంట్ నో వై’ మ్యూజిక్ వీడియోను ప్రేమ, భావోద్వేగాల మేళవింపుతో అద్భుతంగా మలిచారు.





‘బ్రహ్మా ఆనందం’ సక్సెస్ మీట్‌లో బ్రహ్మానందం

మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ‘బ్రహ్మా ఆనందం’ అనే చిత్రం ఫిబ్రవరి 14న వచ్చింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హొలక్కల్ కీలక పాత్రల్లో కనిపించారు. శ్రీమతి సావిత్రి,శ్రీ ఉమేష్ కుమార్ సమర్పణలో ఈ చిత్రాన్ని రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా.. నూతన దర్శకుడు ఆర్.వి.ఎస్. నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో శనివారం నాడు చిత్రయూనిట్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డ్ గ్రహీత డా.బ్రహ్మానందం మాట్లాడుతూ..‘బ్రహ్మా ఆనందం సినిమాను చూసిన వారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. మీ కన్నా.. మీ అబ్బాయి బాగా చేశాడని మెచ్చుకుంటూ ఉంటే తండ్రిగా నాకు చాలా సంతోషంగా అనిపించింది. కొత్త పాత్రలను చేయాలనే ఎప్పుడూ కోరుకుంటాను. నన్ను అభిమానించే ఆడియెన్స్‌కు ఏదైనా కొత్తగా అనిపించాలనే ఉద్దేశంలోనే సినిమాను చేస్తుంటాను. చాలా కాలం తరువాత ఓ మంచి సినిమాను, మంచి పాత్రను చేశాననే సంతృప్తి కలిగింది. ఆడియెన్స్‌ని థియేటర్లకు రప్పించే గొప్ప అంశాలేమీ ఇందులో లేవు. నేను, వెన్నెల కిషోర్, స్వధర్మ్ ఎంటర్టైన్మెంట్, నా కొడుకు రాజా గౌతమ్‌లు మాత్రమే ఉన్నారు. ‘మీరు చాలా రోజుల తరువాత కనిపిస్తున్నారు కదా? అందుకే థియేటర్లకు జనాలు వస్తున్నారు’ అని చాలా మంది చెబుతుంటే ఆనందంగా ఉంది. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు కాకుండా రంగమార్తాండ లాంటి కారెక్టర్లు చేయాలని అనుకుంటున్నాను. డైరెక్టర్లే నన్ను కొత్తగా చూపించే ప్రయత్నం చేయాలి. నా మీద ప్రేమతో యంగ్ దర్శకులు వచ్చి.. ఒక్క రోజు పాత్ర ఉంది.. చేయండి సర్ అని అడుగుతుంటారు. అలా చేయడం వల్ల నాకు వచ్చిన నష్టం ఏమీ లేదు కదా?.. నేను ఆ పాత్ర చేస్తే వాళ్లకి ఉపయోగపడుతుంది కదా? అని నేను చిన్న పాత్రల్ని అయినా చేస్తున్నాను. నా కోసం ఇంత మంది థియేటర్‌కు వచ్చి సినిమా చూస్తున్నారు అని తెలిసి ఎంతో ఆనందమేస్తోంది’ అని అన్నారు.



## ‘యుద్ధం రేపటి వెలుగు కోసం.. ‘త్రికాల’

రిత్విక్ వేట్నా సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మాతలుగా శ్రీ సాయిదీప్ చాట్లా, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలుగా త్రికాల సినిమాను మణి తెల్లగూటి తెరకెక్కిస్తున్నారు. శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.‘యుద్ధం రేపటి వెలుగు కోసం.. కానీ ఈ అంధకాసురిడి యుద్ధం వెలుగుని నాశనం చేయడానికి’.. అంటూ తనికెళ్ల భరణి డైలాగ్స్‌తో మొదలైన ట్రైలర్.. యాక్షన్ సీక్వెన్స్, గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ ఇలా అన్నీ కూడా హై స్టాండర్డ్స్‌లో ఉన్నాయి. ‘ఒక సైక్రియార్టిస్ట్‌గా ఛాలెంజింగ్ కేసుని చూస్తున్నా’ అంటూ శ్రద్ధా దాస్ పాత్రను ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. మాస్టర్ మహేంద్రన్ చేసే యాక్షన్ సీక్వెన్స్, ట్రైలర్ చివర్లో అజయ్ విశ్వరూపం, డైలాగ్స్ అదిరిపోయాయి. త్రికాల ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రయూనిట్ శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అజయ్ మాట్లాడుతూ.. ‘మణి నాకు రెండు, మూడేళ్ల క్రితం త్రికాల కథ చెప్పారు.

బడ్జెట్ ఎక్కువ అయ్యేట్టుంది ఎలా చేస్తారో అనుకున్నా. ఇంత వరకు నాకు ఏం చూపించలేదు. నేరుగా ఇక్కడే ట్రైలర్‌ను చూశాను. అద్భుతంగా వచ్చింది. మణి, శ్రీనివాస్ గారు ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటారు. అందరూ ది బెస్ట్ ఇచ్చారు. మహేంద్రన్ అందరి కంటే చాలా సీనియర్. మంచి చిత్రాన్ని తీశాం. క్వాలిటీ అద్భుతంగా ఉంది. ఈ సినిమాను అందరూ సపోర్ట్ చేయండి’ అని అన్నారు.

## “ఇట్స్ ఓకే గురు” నుంచి ‘నిలవదే నిలవదే..’ లిరికల్ సాంగ్

చరణ్ సాయి, ఉషశ్రీ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా “ఇట్స్ ఓకే గురు”. ఈ చిత్రాన్ని వండర్ బిల్ట్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్ గౌడ్ నిర్మిస్తున్నారు. దర్శకుడు మణికంఠ ఎం రూపొందిస్తున్నారు. త్వరలో ఇట్స్ ఓకే గురు సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ‘నిలవదే నిలవదే..’ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ‘నిలవదే నిలవదే..’ పాటను సంగీత దర్శకుడు మోహిత్ రెహ్మానియక్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా..లక్ష్మీ ప్రియాంక ఫీల్ గుడ్ లిరిక్స్ రాశారు. సిద్ధార్థ్ మీనన్ ఆకట్టుకునేలా పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే - ‘నిలవదే నిలవదే ..ఎదురుగా నా మది..తపన తెరచాటులో..తగని ఆరాటమే, రెండై ఉన్న ప్రాణాలే ఒకటయ్యాయిలా, నీతో ఉన్న కాలాలే మధురమే...’ అంటూ మంచి లవ్ ఫీల్ తో సాగుతుందీ పాట.



Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**